# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 127 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

18-03-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# శ్రీకాకుళంలో వైఎస్ఆర్‌సీపీ శాంతియుత నిరసన

- టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా డిమాండ్
- నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులపై ఆగ్రహం





**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణంలో వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ నిరసనలో జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీ ధర్మాన కృష్ణదాస్, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎచ్చెర్ల సమన్వయకర్త గొర్ల కిరణ్ కుమార్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఇచ్ఛాపురం సమన్వయకర్త శ్యాంప్రసాద్ రెడ్డి, ఆముదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, యువనాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ తదితరులు హాజరయ్యారు.

అలాగే రాష్ట్ర నాయకులు, స్టేట్ ఎస్ఈసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, రైతు విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# "రైతన్న మీ కోసం"తో గ్రామంలో సందడి

- రైతుల గడపగడపకు ఎమ్మెల్యే గౌతు శిరీష
- వ్యవసాయానికి ఆధునిక దిశలో ప్రభుత్వం అడుగులు



**నవతరం -మందస**

"రైతన్న మీ కోసం" కార్యక్రమంతో మందస మండలం పొత్తంగి గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతు కుటుంబాలకు అండగా నిలబడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సాగునీటి సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా అధిక లాభాలు, అలాగే అన్నదాత సుఖీభవ, పీఎం-కిసాన్ వంటి పథకాలతో రైతులకు నేరుగా మద్దతు అందిస్తున్నామని పేర్కొన్నారు.

రైతుల ఆదాయం పెంచడం, ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# చెత్త డస్ట్‌బిన్‌లోనే వేయాలి





- కాలువలు ప్రక్కలో చెత్త వేయరాదు
- రెండు వారాల్లో శ్రీకాకుళం నగరం శుభ్రం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం**

రోడ్లపై ఉన్న చెత్తను తీసి డస్ట్ బిన్ లో మాత్రమే వేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం బాపూజీ కళామందిర్ లో ఏర్పాటు చేసిన పరిశుభ్రత పై మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్య కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేసినపుడు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఉండి పనిచేయాలన్నారు. ఒక్కొక్కరిగా ఉండి పని చేయరాదన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదన్నారు. రెండు వారాల్లో శ్రీకాకుళం నగరం శుభ్రం చేయాలని చెప్పారు. చెత్త సేకరణ పై దృష్టి సారించి బయట లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇంటింటి చెత్త సేకరణ జాగ్రత్తగా చేయాలన్నారు. ప్రతీ ఇంటి వద్ద ఉన్న చెత్త సేకరించాలని పేర్కొన్నారు. ఇంటిలో ఉన్న చెత్త బయట పారవేయకుండా ఇంటి యజమానులకు చెప్పాలన్నారు. బాగా పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. పారిశుధ్య కార్మికులు పై గౌరవం ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాల్సిందేనన్నారు. కాలువల ప్రక్క చెత్త ఉండరాదన్నారు. చేసిన పనే గుర్తింపు ఇస్తుందన్నారు. గ్లౌజులు తప్పనిసరిగా దరించి ఉండాలని ఆదేశించారు.

గ్లౌజులు దరించకపోతే హాజరు ఉండదని స్పష్టం చేశారు. ఇఎస్ఐ కార్డులు, పిఎఫ్ ఉన్నదీ లేనిదీ పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించేందుకు విచ్చేసిన రాజమండ్రి కార్పొరేషన్ కు సంబంధించి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మాధవి, మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ సుధీర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మం కాలాతీతమైన జీవన విధానం

- ప్రపంచమంతా వసుదైక కుటుంబం
- మానవుడు ఉన్నతి సాధించే మార్గమే సనాతన ధర్మం
- ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ జార్జ్ విక్టర్
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు

3లో






# అరసవల్లిలో కృష్ణాంగారక చతుర్ధశి ప్రత్యేక పూజలు



- సూర్యనారాయణ స్వామివారికి మహాలింగార్చన నిర్వహణ
- భక్తుల సందడి మధ్య పూజా కార్యక్రమం

3లో

ఎడిటోరియల్

# అకాలజ్ఞత

కొన్ని శతాబ్దాల క్రితమే మన విష్ణుశర్మ పంచతంత్ర కథలు చెప్పాడు.
అందులో మిత్రలాభం, మిత్రభేదం అనేవి మొదటి రెండు. వీటిల్లో అనేక ఉపకథలు, ఒకదానికొకటి లింకవుతూ సాగుతాయి. పిల్లలందరికీ తెలిసే ఉంటుంది. ఇప్పటికీ పంచతంత్ర కథలు చాలా ఆసక్తిగా చదివిస్తాయి. అందులో పక్షులు, జంతువులు పాత్రదారులుగా ఉన్నా, మనుషులకు వర్తించే నీతిని, ధర్మాలను, నిజాయితీలను వర్ణిస్తూ సాగుతాయి. మిత్రభేదం మొదటికథలో అడవిరాజు సింహం, ఒక పెంపుడు ఎద్దు మధ్య అసహజ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడం ఈ తంత్రం యొక్క ఇతివృత్తం. ఎద్దుతో స్నేహం కారణంగా రాజు తన ప్రజల పట్ల తన బాధ్యతలను మరచిపోయినప్పుడు, అతని మంత్రి, ఒక నక్క, ఆ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక పథకం వేస్తుంది.
ఇకపోతే, మిత్రలాభంలో కూడా చాలా కథలున్నాయి. కథ చెప్తూ విష్ణుశర్మ ఇలా అంటాడు. 'సామాన్యుడు కానీ, రాజ్యాధికారి కానీ, తమ జీవిత కాలంలో మంచి మిత్రులను సంపాదించుకోవాలి. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన మిత్రుడు' అని కథలో వివరిస్తాడు.
నేను కథలు వివరించను గానీ, లఘుపతనకుడనే కాకి, హిరణ్యకుడు "శత్రువులతో మైత్రి ప్రమాదకరం. కాగిన నీళ్లయినా అగ్నిని ఆర్పేస్తాయి. వైరం రెండు విధాలు. పుట్టుకతో వచ్చేది సహజవైరం. ఏదో సరిపడక వచ్చేది మామూలు వైరం. కుక్కా పిల్లి కలిసి ఉండగలవా? నీటికి నిప్పుకీ మధ్య నేస్తం కుదురుతుందా? నేను నీ ఆహారాన్ని, నువ్వు నన్ను తినేదానివి. నీకూ నాకూ స్నేహం కుదరదు" అని స్పష్టంగా చెప్పేస్తుంది ఎలుక.
ఇప్పుడీ పంచతంత్ర కథల ప్రస్తావనెందుకంటే, శతాబ్దాల క్రితం చేసిన ఆలోచనలను ఇప్పుడు మన పాలకులు చేయకపోవటం, ఎంత బుద్ధిహీనత! హిరణ్యకుడి ద్వారా విష్ణుశర్మ మనకేం చెప్పాడు. ఎవరు మనకు నిజమైన మిత్రులు, ఎవరు శత్రువులు, అనే విచక్షణ ఉండాలని కదా! చెప్పింది. మరి మన నేటి పాలకులకు ఆ వివేచన ఉందా? మొత్తం ప్రపంచాన్ని, ప్రపంచ దేశాల వనరులను కాజేయడానికి, దేశాలపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని, యుద్ధాన్ని సృష్టిస్తున్న సామ్రాజ్యవాద అమెరికాను మిత్రుడుగా భావించడం, దానితో మిత్రుత్వాన్ని నెరపడం కొరవితో తలగోక్కోవడం కాదా! అమెరికాతో అంటకాగుతూ యుద్ధ చిచ్చును రగిల్చిన ఇజ్రాయిల్ దేశం మనకెట్లా స్నేహితుడవుతాడు! కొన్ని తరాలుగా,చారిత్రకంగా భౌగోళికంగా మన భారతదేశానికి మిత్రునిగా ఉన్నాడు. సంస్కృతి సంప్రదాయాల కలబోతలు, ఆదాన ప్రదానాలు కలిగిన సంబంధాన్ని శత్రుసంబంధంగా మార్చే నీతిబహ్య చర్యలు, దేశ ప్రజల ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగపడవు. అంతేకాదు హీనచరితగా మిగిలిపోతుంది. వెనిజులాపైన అమెరికా దాడిచేసి, మదురో దంపతులను అంతర్జాతీయ న్యాయసూత్రాలనన్నింటినీ అతిక్రమించి ఎత్తుకుపోతే మన దేశ పాలకుడు మోడీ ఏమీ మాట్లాడలేదు. శాంతికోసం ఆలింగనం చేసుకునివచ్చిన మరుక్షణంలో ఇజ్రాయిల్ నెతన్యాహు ఇరాన్‌పై బాంబులు వేస్తే ఒక్కమాటా మాట్లాడలేదు. వందలాది మందిని చంపుతున్నా, ఆఖరికి ఇరాన్ దేశాధినేతను చంపినా కిమ్మనలేదు.
అనేక సంవత్సరాలుగా రష్యా మనదేశానికి చౌకగా చమురు సరఫరా చేస్తుంటే, అమెరికా ఆదేశించిందని మానేసి, అమెరికా ఎక్కువ ధరకు ఇస్తున్న చమురును కొనటం ఎంత దిగజారుడుతనం.
ఇప్పుడేమయింది! ఇదివరకెన్నడూ లేని కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నామని మంత్రి హర్దీప్‌సింగ్‌పురి పార్లమెంటులో ప్రకటించాడు. గ్యాస్‌బండ ధరలు పెరుగుతున్నాయి. అసలు గ్యాసు దొరకక చిన్న చిన్న వ్యాపారాలు హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. ఐటీ ఉద్యోగులకు క్యాంటీన్‌లు లేకుండా పోయాయి. రోడ్డుపక్క మిర్చిబజ్జీల బండ్లు మూసేశారు. ఆర్డర్లు లేక స్విగ్గీ, జొమాటోలో ఉపాధి పొందుతున్నవారు రోడ్ల పాలవుతున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత దేశం మొత్తం పెరిగింది.
నెతన్యాహు, ట్రంప్ మిత్రులను అడుగుతాడా సహాయం! ఇట్లాంటి యుద్ధ సమయంలో కూడా ఇంత లొంగుబాటును ప్రదర్శించినప్పటికీ, భారత్‌పై సుంకాలు పెంచుతామని అమెరికా ప్రకటిస్తున్నది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. చమురు నౌకలను కదలకుండా ఆపేసింది. మిత్ర దేశాలకు మాత్రం సరఫరాకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. నిన్ననే ఒక చమురు నౌక మన తీరానికి చేరుకున్నట్లు ప్రకటించారు. ఇప్పటికి కూడా మన దేశానికి ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు? తెలుసుకోకపోతే నష్టపోయేది ప్రజలు. తెలిసీ ఉన్మాదుల పక్కన చేరితే, ప్రజలు ఊరుకోరు. కొంత ఆలస్యంగానైనా మీ అసలు రూపాన్ని తెలుసుకుంటారు. ఎందుకంటే, ప్రజలు పంచతంత్ర కథలన్నీ చదువుకొని ఉన్నారు.

## మునగ ఉత్పత్తులతో మహిళల
# ఆర్థిక సాధికారతే లక్ష్యం

### నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ

**నవతరం -మెలియాపుట్టి**

గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే నాబార్డ్ ప్రధాన లక్ష్యమని, మునగ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు నెలకు రూ.10 వేల వరకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ పేర్కొన్నారు. మెలియాపుట్టి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నాబార్డ్ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సమాఖ్య అమలు చేసిన 15 రోజుల 'మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
మునగలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడంతో పాటు, నాబార్డ్ ప్రాయోజిత ప్రదర్శనలు, రూరల్ మార్ట్స్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మండలంలోని 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు 15 రోజుల పాటు శిక్షణ పొందారు. మునగ పొడి, లడ్డూలు, ప్రోటీన్ మిక్స్, మునగ టీ, ఫేస్ ప్యాక్, మోరింగా మిల్లెట్ పకోడి వంటి వినూత్న ఉత్పత్తుల తయారీలో వీరికి ప్రాయోగిక పరిజ్ఞానం అందించారు. కార్యక్రమం అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రమేష్ కృష్ణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎంలు ఈశ్వరరావు, త్రినాధమ్మ, మండల మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అన్నమయ్య జిల్లాలోని...
# రాయచోటి వీరభద్రాలయం



వీరభద్ర స్వామి, శివుని ఉగ్రరూప అవతారం, దక్ష యజ్ఞంలో సతి ఆత్మాహుతికి ప్రతీకారంగా శివుని జటాజూటం నుండి జన్మించారు: అహంకారాన్ని అంతం చేయడమే ఆయన ప్రధాన ఉద్దేశ్యం, శివుని ఆజ్ఞతో దక్షుని శిరచ్ఛేదం చేసి, దేవతలను శిక్షించి, విశ్వాన్ని రక్షించారు, ఆయన భయంకరమైన రూపం, అనేక ఆయుధాలు ధరిస్తారు, ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో పూజలందుకుంటారు.
రాయలేలిన రతనాల సీమే రాయచోటిగా నేడు వెలుగొందుతోంది. రాయల కాలంలో రాచోటి పక్కన ఉన్న మాండవ్య నది ఒడ్డున భద్రకాళి సమేత వీరభద్రుస్వామి దేవాలయం వెలసింది. ఈ దేవాలయం రాయల కాలం నుండి అత్యంత ప్రసిద్ధి గాంచింది. పూర్వ కాలంలో సామంతరాజులు ఈ ప్రాంతానికి విచ్చేసిన సమయంలో మాండవ్య నది ఒడ్డున సేద తీరుతూ ఉండేవారని ప్రతీతి. ఆ కాలంలోనే భద్రకాళి సమేత వీరభ్రస్వామి దేవాలయాన్ని భక్తి ప్రపత్తులతో నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు మాండవ్య నది ఒడ్డున వెలసిన వీరభద్రస్వామి దేవాలయం భక్తులతో కళకళలాడుతోంది. గతంలో రాచోటిగా పిలువబడే నేటి రాయచోటికి పేరు ప్రఖ్యాతలు రావడానికి వీరభద్రస్వామి దేవాలయమేనని పెద్దలు పేర్కొంటున్నారు.
రాయచోటిలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్రుడు భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. వీరభద్ర ఆలయం వీరశైవుల పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. స్వయంగా వీరభద్రుడే విగ్రహ మూర్తిగా ఇక్కడ కొలువైనందున రాయచోటి వీరభద్ర ఆలయాన్ని దక్షణ భారత దేశ వీరభద్ర ఆలయానికి మూలవిరాట్గా పేర్కొంటుంటారు. చోళ సామ్రాజ్య విస్తరణలో భాగంగా యుద్ధాలు చేసి ఆలసిపోయిన రాజాధిరాజ చోళుడు మానసిక ప్రశాంతత కోసం దేశ ఘటనకు బయలుదేరి ఇక్కడి మాండవ్య నది తీరానికి చేరుకున్నాడు. కొండల, గుట్టల నడుమ ప్రవహిస్తున్న మాండవ్య నది ఒడ్డున సాగైన పూల తోటలతో ఈ ప్రాంతం ఆయనకు విశేషంగా ఆకర్షించిందని, దీంతో ఆయన ఇక్కడే తన సపరివారంతో నిలిచిపోయి భద్రకాళి సమేత వీరభద్రుని కొలువు జీర్ణావస్థలో ఉన్న ఆలయాన్ని పునః నిర్మించాడని చరిత్ర చెబుతోంది. వీరభద్రునికి రాచరాయుడు అనే పేరు కూడా ఉంది.
ఆలయ గాలిగోపురం ముందు భాగంలో 56 అడుగుల ఎత్తు గల ఏక శిలారాతి దీప స్తంభం ఉంది. ఇది ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇంత పెద్ద ఏకశిల దీపాస్తంభం దక్షణ భారత దేశంలోనే మరెక్కడా లేదని చెప్పవచ్చు. ప్రతి ఏటా కార్తీక మాసంలో ఈ స్తంభంపై భాగంలో దీపం వెలిగించి స్వామి వారిని ఆరాదించడం ఆనవాయితీగా వస్తోంది.
ఈ పురాతన ఆలయం వీరశైవుల పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. వీరికి వీరభద్రుడు ఇలవేల్పు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు రాష్టం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తాదులు విచ్చేస్తుంటారు.
వీరభద్రుడిని హిందువులే కాక ముస్లింలు కూడా కులదైవంగా ఆరాధించే సాంప్రదాయం వుంది. స్వామివారి బ్రహోత్సవాలలో కులమతాలకు అతీతంగా సర్వమతస్తులు పాల్గొంటారు. ముస్లీంలలో దేశముఖ్ తెగకు చెందిన వారు ఉత్సవాలకు స్వామివారికి సాంప్రదాయ బద్ధంగా పూజాసామాగ్రిని పంపితే ఆలయకమిటీ వాటిని స్వీకరించి వారి పేరుతో పూజలు నిర్వహించిన తీర్థప్రసాదాలను తిరిగి వారికి పంపడం ఆనవాయితీగా వుంది. ఈ సాంప్రదాయాలను పరమత సహసనానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. మాండవ్యనది పరీవాహక ప్రాంతంలో కొలువైన వీరభద్రాలయం భక్తుల కోర్కెలు తీర్చే వీరశైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. పది శతాబ్దాలపై బడిన చరిత్ర కలిగి ఈ వీరభద్రాలయ పేరు ప్రతిష్టలు దశదిశలు వ్యాపించాయి. ఆలయం మూడు గాలిగోపురాలతో అందమైన శిలాకళ సంపదతో విరాజిల్లుతూ చూపరులను ఆకట్టుకుంటోంది.

### అర్చావిగ్రహమూర్తిగా ఆవిర్భవించిన వీరభద్రుడు

అలనాడు దక్షప్రజాపతి ఆత్మజ్ఞానహీనుడై శివద్వేశంతో తలపెట్టిన యజ్ఞానికి బ్రహ్మ, విష్ణువు తదితర దేవతలను ఆహ్వానించి నిరీశ్వర యాగం తలపెట్టారు. యజ్ఞవిషయాన్ని తెలుసుకున్న శంకరుని భార్య అయిన సతీదేవి పుట్టింటిపై మమకారంతో, తన తండ్రి చేస్తున్న తప్పును తెలియజేయడానికి పతిదేవుడు పిలువని పేరంటానికి వెళ్ళకూడదని చెప్పినా తన భర్త మాటమీరి విచ్చేసిన సతీదేవికి దక్షుడు చేసిన అవమానాన్ని భరించలేక దేవతలందరి సమక్షంలో ఆత్మాహుతి గావించుకుంది. అది తెలిసిన మహోగ్రుడైన రుద్రుడు విలయతాండవం చేసి తన జటను పెరిగి నేలకు విసిరితే అందుండి ప్రళయభీకరాకర వీరభద్రుడు ఉద్భవించి రుద్రగణ సహితుడైన యజ్ఞశాలపై విరుచుకు పడ్డాడు. ఆ నిరీశ్వర యాగానికి విచ్చేసిన దేవతలందరినీ దండించారు. దక్షుని పట్టుకొని తన ఖడ్గంతో శిరస్సు ఖండించి అగ్నికి ఆహుతి చేశాడు. అర్థాంతరంగా దక్షయజ్ఞం ఆగిపోయింది. వీరభద్రుడు సృష్టించిన భీభత్సానికి శివుడు సంతోషించాడు. వీరభద్రుని వీరత్వానికి మెచ్చుకొని వీరులకు వీరేశ్వరుడవై వర్ధిల్లుదువుగాక అని దీవించాడు. అప్పటి నుంచి వీరభద్రుడు వీరేశ్వరుడని పిలువబడ్డాడు. పూర్ణవిరాగి అయిన శివుడు ఒక వటవృక్షమూలంలో ధ్యాన నిమగ్నుడై కూర్చుండి పోయాడు. ప్రజాపతులలో జ్యేష్టుడైన దక్షుడు ప్రాణాలు కోల్పోవడం, అర్థాంతరంగా యజ్ఞం ఆగిపోవడం లోకపద్రవాలకు దారి తీసింది. సృష్టి క్రమానికి ఆటంకం ఏర్పడింది. శివావరాధనికి గురైన దేవతలు దివ్వతేజోవిహునులై దేవలందరూ ఆలోచించి శివానుగ్రహం పొంది దక్షున్ని బ్రతికించి లోకకళ్యాణార్థం తిరిగి యాగం కొనసాగించాలని నిర్ణయించుకొన్నారు. బ్రహ్మాదిదేవతలు విష్ణుమూర్తిని వెంట పెట్టుకొని కైలాసం వెళ్ళారు. అక్కడ దక్షణాభిముఖుడై వటవృక్ష మూలంలో చిన్ముద్ర ధరించి మౌనియై బ్రహ్మనిష్టలో ప్రకాశిస్తూ దక్షిణామూర్తియైన శివుడు దేవతలకు దర్శనమిచ్చాడు. ఏకాగ్రచిత్రులై దేవతలు భక్తితో దక్షిణామూర్తిని మనసారా ప్రార్థించారు. సర్వం గ్రహించిన గురుమూర్తి వారి తప్పును మన్నించాడు. దక్షుని అపరాధాన్ని బాలరాపరాధంగా భావించి క్షమించచాడు. ప్రసన్నుడైన పరమేశ్వరుడు తన అంశీభూతుడైన వీరభద్రున్ని పిలిచి ఇలా అన్ని పుత్రా వీరభద్రా కాలదోషం పట్టి ప్రజాపతులను దేవతలకు ఆత్మజ్ఞానంతో వారు చేసిన పని వల్ల సతీదేవి ప్రాణత్యాగం వారి పాలిట స్త్రీహత్యాపాతకమైన చుట్టుకుంది. కారణావతారుడవైన నువ్వే వీరందరికీ జ్ఞానబిక్ష పెట్టగల సమర్థుడవు మూర్ఖుడైన దక్షునికి ప్రాణబిక్ష పెడుతున్నాను. ఆయన తిరుగు ప్రయాణంలో రామేశ్వరానికి, శ్రీశైలానికి నడుమనున్న ఈ మాండవ్యనదీ తీరమందు వీరేశలింగము నిలిచి ప్రకాశించింది. అప్పటికే ఇచ్చోట మండవీమాత(యల్లమ్మ) ఆలయం నెలకొని వుండేది. వీరేశలింగం వెలయడంతో ఈ క్షేత్రం శివశక్తి పీఠమై తేజరిల్లింది. సర్వదేవతలంకు ఇచ్చట మనస్సు శాంతించింది. అంతా శివసంకల్పం అని భావించి వీరేశ్వరుడు తదేక భక్తితో పరమశివున్ని ధ్యానించాడు. తక్షణం పొడవాటి మీసములు, వాడియైన కోరలు, సహస్రభుజ, సహస్రాయుధాలతో విరాజితుడైన వీరభద్రుని ఉగ్రరూపం మటుమాయమైంది. మౌని చిన్ముద్రధారి, సర్వలోక గురుస్వరూపియైన శ్రీదక్షిణామూర్తి వీరేశ్వరనలో మూర్తీభవించాడు. సతీజగన్మాత ఆత్మ శాంతించింది. దక్షాధి అమరులకు పరమ పవిత్రమైన పంచాక్షరీ మంత్రోపదేశ మయ్యింది. దక్షాధి దేవతలందరికీ తిరిగి దివ్వతేజస్సు ప్రకాశించింది. తమ జ్ఞానబిక్ష పెట్టిన ఈ పుణ్యక్షేత్రములో అమరగురు వీరేశ్వరుడునే పేరిట వెలసి నిత్యం దేవతల సేవలు అందుకోవలసినదిగా దక్షాధిదేవతలు వీరభద్రుని ప్రార్థించారు. అలనాడు దక్షాధి దేవతల ప్రార్థన మన్నించి గురుపాదపూజ నిమిత్తం ప్రతియోటా ఉత్తరాయణం మీనమాసం సూర్యోదయం ఉదయం 6 గంటలకు మీన లగ్నమందు 5 రోజులు కేవలం అరగడియ కాలం సాత్విక దేవతలకు, మరియు దక్షిణయానం కన్యామాస కన్యాలగ్నమందు 5 రోజులు కేవలం అరఘడియకాలం ఉగ్రదేవతలకు సూర్యమండలం నుండి సూర్యరశ్మి మార్గాన గర్భాలయంలోకి ప్రవేశించి పాదార్చన చేసుకొమ్మని వీరేశ్వరుడు వరమిచ్చాడట. ఇప్పటికీ మనము ఈ విచిత్రం ప్రత్యక్షంగా చూడవచ్చును. ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రష్టాల నుండి అశేష భక్త జనులు ఈ వీరేశ్వర క్షేత్రాన్ని నిత్యం దర్శిస్తూ వుంటారు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# "పేరులో ఏముంది? అంతా నీలో ఉంది!" ఒక ఉగాది కథ



తెనాలి దగ్గర ఒక చిన్న పట్టణంలో ఉగాది పండుగ రోజు ఉదయం చాలా ఉత్సాహంగా మొదలైంది. ఇళ్ల ముందు రంగవల్లులు, తలుపుల వద్ద మామిడి తోరణాలు, ఇంట్లో కారాలీవీ వంటకాల సువాసనలు... ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది.

ఆ ఇంట్లో చిన్నవాళ్లు అందరూ కలిసి పంచాంగం వినడానికి సిద్ధమయ్యారు. ఆ రోజు కొత్త సంవత్సరానికి పేరు "పరాభవ నామ సంవత్సరం" అని చెప్పారు.

అది విన్న చిన్నవాడు రాహుల్ కొంచెం ఆశ్చర్యపోయాడు.

"పరాభవ అంటే ఓటమి కదా! మరి ఈ సంవత్సరం మంచిదేనా?" అని అడిగాడు.

అప్పుడు ఆ ఇంట్లో ఉన్న పెద్దమ్మ నవ్వుతూ చెప్పింది:

"బిడ్డా... పేరులోనే అంతా ఉండదు. పేరులో ఉన్న అర్థం లోతుగా తెలుసుకుంటేనే నిజం తెలుస్తుంది."

ఆమె ఇలా వివరించింది:

"మనలో ఉన్న అహంకారం మీద జయం సాధిస్తే అదే నిజమైన విజయం.
మనలో ఉన్న గర్వాన్ని తగ్గిస్తే జీవితం అందంగా మారుతుంది.
సత్య మార్గంలో నడిస్తే మన జీవితం సార్థకం అవుతుంది.
వినయం పెంచుకుంటే మనసుకు శాంతి వస్తుంది.
అనుమానాన్ని నియంత్రిస్తే మన సంబంధాలు బలపడతాయి."

అందరూ ఆ మాటలు ఆసక్తిగా విన్నారు.

ఆ తర్వాత పెద్దమ్మ ఉగాది పచ్చడిని చూపిస్తూ చెప్పింది:

"ఇదిగో ఈ ఉగాది పచ్చడిలో ఉన్న షడ్రుచులు లాగా మన జీవితంలో కూడా సుఖం, దుఃఖం, కోపం, ఆనందం అన్నీ ఉంటాయి. అవన్నీ కలిసే జీవితం సంపూర్ణం అవుతుంది."

ఇంట్లో అందరూ కలిసి అభ్యంగ స్నానం చేసి, కొత్త బట్టలు వేసుకున్నారు. మామిడి తోరణాలతో ఇంటిని అలంకరించారు. బంధుమిత్రులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇంట్లో నవ్వులు, ఆనందం నిండిపోయింది.

అప్పుడు రాహుల్ ఆనందంగా అన్నాడు:

"ఇప్పుడు అర్థమైంది పెద్దమ్మ... పేరులో ఏముంది? మనం ఎలా జీవిస్తామో అదే ముఖ్యము!"

అందరూ నవ్వుతూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు.

అలా ఆ కుటుంబం "పరాభవ" నామ సంవత్సరాన్ని భయంతో కాదు, ఆత్మపరిశీలనతో మరియు సంతోషంతో ప్రారంభించింది.

?? పేరులో ఏముంది? అంతా మనలోనే ఉంది!

రచన: తేరాల రాజేంద్ర ప్రసాద్
చరవాణి:9297109223
మీసేవ , గిరినగర్ , హైదరాబాద్ -37

# మిత్రులారా మీకోసం

నాకు అత్యంత ఇష్టమైన
భగవద్గీత 10 వ అధ్యాయము
"విభూది యోగం" క్లుప్తంగా...
(20 నుండి 42 శ్లోకాలు)...

శ్రీ కృష్ణ భగవానుడు పలికెను :

ఓ అర్జునా...ఓ కురు శ్రేష్ఠా...
ఇప్పుడు నాయొక్క దివ్య
విభూతులను
నీకు క్లుప్తంగా వివరిస్తాను
శ్రద్ధగా విను.

10.20
ఓ అర్జునా...
సర్వభూతముల
హృదయాంతరాళలో
జీవాత్మగా ఉన్న నన్ను నిత్యము
ధ్యానించవలెను. కారణం సర్వ
ప్రాణుల
సృష్టి , స్థితి, లయ,
కారకుడను నేనే
ఆది, మధ్యం, అంతం నేనే

10.21
నక్షత్రాధిపతియైన చంద్రుడను
నేనే
ద్వాదశ ఆదిత్యులలో విష్ణువు
నేనే
49 మంది వాయుదేవతలలో
తేజం నేనే
జ్యోతిర్మయస్వరూపులలో
సూర్యున్ని నేనే

10.22
వేదాలలో సామవేదం నేనే
ప్రాణులలో ప్రాణశక్తిని నేనే
దేవతలలో ఇంద్రుడను నేనే
ఇంద్రియాలలో మనస్సును
నేనే

10.23
అష్టవసువులలో అగ్నిని నేనే
పర్వతాలలో మేరు పర్వతం
నేనే
యక్ష రాక్షసులలో
కుబేరుడను నేనే
ఏకాదశ రుద్రులలో
శంకరుడను నేనే

10.24
ఓ అర్జునా...
జలాశయాలలో
సాగరున్ని నేనే
సేనాపతులలో
కుమారస్వామిని నేనే
దేవతల పురోహితుల్లో
బృహస్పతిని నేనే

10.25
యజ్ఞాలలో జప యజ్ఞం నేనే
మహర్షులలో భృగు మహర్షిని
నేనే
శబ్దాలలో ఏకాక్షరమైన
'ఓం'కారం నేనే
స్థిరమైన శిఖరాలలో
హిమాలయాన్ని నేనే...





కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

## అరసవల్లిలో కృష్ణాంగారక చతుర్థశి ప్రత్యేక పూజలు

నవతరం -శ్రీకాకుళం

అరసవల్లిలోని ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో కృష్ణాంగారక చతుర్థశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అనివెట్టి మండపంలో స్వామివారికి శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ కార్యక్రమంపై ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఖ.చీ.ఎ.ణ.ఎ ప్రసాద్ వివరాలు తెలిపారు.

## ఇంటి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ

నవతరం -శ్రీకాకుళం

నగర ప్రజలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని నగరపాలక సంస్థ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ రాయితీని పొందాలనుకునే వారు మార్చి 31, 2026 లోపు తమ అసలు పన్ను బకాయిలతో పాటు, మిగిలిన 50 శాతం వడ్డీని ఏకకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మార్చి 31 వరకు అన్ని సెలవు దినాల్లోనూ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9:30 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, పన్ను చెల్లింపుదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## 18న ఇఫ్తార్ విందు

- జిల్లాలో ఉన్న ముస్లిం మత పెద్దలు హాజరుకావాలి
- జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షైక్ మహబూబ్ షరీఫ్

నవతరం -శ్రీకాకుళం

మార్చి 18వ తేదీన ఇఫ్తార్ విందు నిర్వహించబడుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షైక్ మహబూబ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. రంజాన్ శుభ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇఫ్తార్ విందు 18వ తేదీన సాయంత్రం 6 గంటల నుండి శశి కన్వెన్షన్ హాల్, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ కళ్యాణ మండపం, జుడియో భవనం, 4వ అంతస్తు, జిల్లా పరిషత్ రోడ్డులో జరుగుతుందని వివరించారు.
ఇఫ్తార్ విందు కార్యక్రమానికి జిల్లాలోని ముస్లిం మత పెద్దలు తప్పకుండా హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

# సనాతన ధర్మం కాలాతీతమైన జీవన విధానం

నవతరం -శ్రీకాకుళం

సనాతన ధర్మం (హిందూ ధర్మం) అత్యంత ప్రాచీనమైన, కాలాతీతమైన జీవన విధానమని ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ జార్జ్ విక్టర్, ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సనాతన ధర్మం భారతదేశ దర్పణీకత అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది సత్యం, అహింస, కర్మ సిద్ధాంతం, వసుధైక కుటుంబకం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) వంటి సార్వజనీన విలువలను సనాతన ధర్మం బోధిస్తుందన్నారు. వేదాలు, యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రోత్సహిస్తూ, ప్రకృతిని ఆరాధించడం, సర్వభూత దయ, మత సహనాన్ని ఇది ప్రత్యేకంగా చాటుతుందని వివరించారు. సనాతన ధర్మం అనేది కేవలం మతం కాదు, ఇది సత్యం, ధర్మం, ఆత్మనిగ్రహం వంటి సద్గుణాల ద్వారా మానవుడు ఉన్నత స్థితిని సాధించే మార్గమని పేర్కొన్నారు. ఇది వేల సంవత్సరాల క్రితం నుండి కొనసాగుతున్న, కాలానికి అనుగుణంగా మారగల జీవన శైలి అని స్పష్టం చేశారు. ప్రకృతిని, చెట్లను, నదులను దేవతలుగా భావించి పూజించడం (ప్రకృతి ఆరాధన) సనాతన ధర్మంలో ఉందని ఇది పర్యావరణ పరిరక్షణకు మార్గం చూపుతుందని చెప్పారు. సనాతన ధర్మంతో క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. విద్యార్థులు సనాతన ధర్మాన్ని పాటిస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాడుపడాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మం వ్యక్తిగత వికాసంతో పాటు సామాజిక శ్రేయస్సును, తరతరాలుగా వస్తున్న సనాతన ధర్మం మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలుస్తోందని విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ వై పోలినాయుడు, ఫిలాసఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటరావు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు శిక్షణ

నవతరం -శ్రీకాకుళం

యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగుళూరు సహకారంతో నిర్వహించబడుతున్న స్కూల్ రెడీనెస్, బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీకాకుళం వైసీబీ కార్యాలయం, గార, ఎచ్చర్ల మండలాల్లో పూర్వ ప్రాథమిక తరగతులకు బోధిస్తోన్న 55 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు సీడీఎఫ్ మోడల్, బాలబడి పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాద రావు పాల్గొని మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే మీ పరిధి లోని సెంటర్ లను మోడల్ సెంటర్ గా తీర్చిదిద్దాలని తెలియజేశారు. పిల్లల నమోదు సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ మీ రోజు వారీ టైం టేబుల్ లో భాగంగానే ఈ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు. విద్యా వ్యవస్థ విద్యార్థి కేంద్రీకృతం గా ప్రయాణించాల్సిన అవసరముందన్నారు. ఈ లక్ష్య సాధనకే యూత్ క్లబ్ పనిచేస్తుందన్నారు. ఈ శిక్షణ ను సక్రమంగా వినియోగించుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో భాగంగా శిక్షణ తీసుకున్న ప్రతి అంగన్‌వాడీ వర్కర్, టీచర్‌కు లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పి.మాధవి మాట్లాడుతూ, ప్రాజెక్ట్ కార్యక్రమాలపై వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతోనే ప్రారంభమవుతుందన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతోన్న విద్యార్థులకు టీఎల్ఎం ద్వారా బోధనతో విద్యార్థులు బాగా అభ్యసించగలరని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ చేస్తున్న కార్యక్రమాలు, ప్రాజెక్ట్ అభివృద్ధి పథంలో పిల్లలతో చేస్తున్న అన్ని కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మా ప్రాజెక్ట్ కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై. శంకరరావు, ఎ.రమణమూర్తి, యు.మెహెర్ వాణి, వై.వాసంతి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదబాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

## - దాతలసహాయం కోసం "ఒక అవని" ఎదురుచూపులు



**నవతరం-బగ్గువానిపేట**

శ్రీకాకుళం నియోజకవర్గ మండలం, సింగుపురం పంచాయతీ, బగ్గువానిపేట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి. అప్పన్న అనే నిరుపేద కుటుంబానికి, నగరానికి చెందిన చిరుద్యోగి జి.మణికంఠ నిత్యావసర సరుకులు అందజేసారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పిశెట్టి. అప్పన్న గాయపడి, కోలుకోలేని స్థితికి చేరిపోయారని, శ్రీకాకుళం స్థానిక ఒక వైద్యశాలలో వాద్యసేవలు పొందుతున్నారన్నారు. మరొక నాలుగు నెలలలో తలకి శస్త్రచికిత్స చేస్తారని, పెద్ద దిక్కు అయిన ఆయనకు ఇలా జరగటం బాధాకరమన్నారు. చిన్నపిల్లలున్న ఆకుటుంబానికి ఆర్ధిక సహాయం అవసరమని, మెరుగైన వైద్యానికి దాతలు సహాయం కోరుతున్నారన్నారు. ఈ విషయాన్ని పత్రికా ప్రతినిధి నవతరం చైతన్య, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ ద్వారా తెలుసుకున్నామని, మా వంతు తక్షణ సాయంగా రెండు నెలలకు సరిపడే సరుకులను, పైడి.ఉమా మహేశ్వర్ సహకారంతో అందించామన్నారు. అప్పన్న భార్య ఉమా మాట్లాడుతూ మాకు ఏ ఆధారం లేదని, అప్పుచేసి ఆక్సిజెన్ పరికరాన్ని కొన్నామని, పైపు ద్వారా ద్రవపదార్ధాలను అందిస్తున్నామని, మనసున్న దాతలు ఆదుకోవాలన్నారు. పూర్తి వివరాలకు చరవాణిని సంప్రదించాలని, లేదా ఫోన్ పే (9949842508) ద్వారా సహాయమందించాలని కన్నీరుమున్నీరయ్యారు. ఈ సేవా కార్యక్రమంలో సామాజిక సేవకులు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఐతంలో స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ముగింపు

## డైరెక్టర్ ప్రో. వి వి నాగేశ్వరరావు

**నవతరం టెక్కలి**

ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ బ్యాంకు సహకారంతో, ఎంఎస్ఎంఈ పనితీరు అభివృద్ధి పథకం కింద నిర్వహించిన "ఎంట్రప్రెన్యూర్షిప్ గ్రామ్. ఈ-ఎస్‌డీపీ-ఎస్‌కేఎల్-00043" స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ముగిసినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, 20 రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో అభ్యర్థులకు ఆధునిక డేటా విశ్లేషణ పద్ధతులు, డాష్‌బోర్డ్ రూపకల్పన, వ్యాపార నిర్ణయాల్లో డేటా వినియోగం వంటి అంశాలపై ప్రాయోగిక పరిజ్ఞానం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఎం ఎస్ ఎం ఈ అభివృద్ధి సంస్థ నోడల్ ఏజెన్సీగా, జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం.ఆధ్వర్యంలో నిర్వహించగా, ఐతం కళాశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది.
శిక్షణలో భాగంగా స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగంలో వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, సీ ఎస్ ఎమ్, హెచ్ ఓ డి డా. టి. నరేష్,సీ ఎస్ డీ హెడ్ డా. ఎమ్ వి పి చంద్రశేఖర్,ఎంసీఏ హెడ్ డా. ఎస్ విష్ణుమూర్తి. తదితరులు పాల్గొన్నారు.



# అజాతశత్రువు కృష్ణమూర్తి...

## సత్యసాయి బోధనలే తన జీవిత లక్ష్యంఅంటున్న కృష్ణ మూర్తి దంపతులు

**నవతరం -శ్రీకాకుళం**

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణం.. సహనం ఓర్పు ఆయన సుగుణాలు.. సత్యసాయి బాబా బోధనలు జీవిత లక్ష్యంగా .. మార్గంగా స్వీకరించి ఆ బోధనలు నిత్య జీవితంలో ఆచరిస్తూ అరమరికలు లేని జీవనం గడుపుతున్న శ్రీకాకుళం వాసి .. ప్రముఖ సామాజిక వేత్త.. అనేక నడక సంఘాల్లో పనిచేసి ప్రస్తుతం స్టార్ వాకర్స్ క్లబ్లో సీనియర్ సభ్యునిగా ఉంటున్న నల్లబాటి కృష్ణమూర్తి దంపతులను మంగళవారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వివాహం జరిగి నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం అన్ని వాకర్స్ క్లబ్స్ కలిసి సయ్యక్తంగా సత్కరించారు. సూర్య వాకర్స్ క్లబ్ ద్వారా మూడు దశాబ్దాల క్రితం నడక ప్రారంభించి నేడు స్టార్ వాకర్స్ క్లబ్ లో క్రియాశీలక సభ్యునిగా వ్యవహరిస్తూ అనేక సామాజిక సేవల్లో నిరంతరం నిమగ్నం అవుతూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్న కృష్ణమూర్తి ధన్యులు అని వక్తలు కొనియాడారు.. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 50 ఏళ్ల వివాహ బంధం ఒక అరుదైన అవకాశం అని ఎన్నో పుణ్య కార్యాలు చేసుకొనే దంపతులకు ఈ అవకాశం దొరుకుతుందని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్.. పీజీ గుప్తా.. ఎస్. జోగినాయుడు ..డాక్టర్ కె. పాండు రంగారావు.. ఐకే రావు గేదెల లక్ష్మీ ..రాడ కైలాసరావు లు అన్నారు.. మూడు దశాబ్దాల నుండి నడక ఉద్యమంలో చురుకుగా



పనిచేస్తూ..75 ఏళ్ల వయస్సులో నవ యవ్వన యువకునిలా అందర్నీ చిరునవ్వుతో పలకరించే నల్లబాటి కృష్ణమూర్తి అజాత శత్రువుగా పేరుగాంచారు అన్నారు. సత్యం.. ధర్మం.. ప్రేమ ..శాంతి అనే సత్యసాయి బాబా బోధనలు తన జీవిత లక్ష్యంగా ..మార్గంగా స్వీకరించి నిత్య జీవితంలో ఆచరిస్తూ.. ఆధ్యాత్మక వేత్తగా విరాజిల్లుతున్నారు అని పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించారు.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ.. కృష్ణమూర్తి దంపతులు సమాజానికి అందించే సేవలు గుర్తించి 1992 లో అఖిల భారత స్వర్ణ కారుల సంఘం ఢిల్లీలో "స్వర్ణ భూసన్ "అవార్డ్ ఇచ్చి సత్కరించారని అదేవిధంగా దేశంలో అత్యున్నత స్థాయి పురస్కారం 1995 మార్చి 15న నాటి రాష్ట్రపతి జ్ఞాన్ జైల్ సింగ్ చేతులమీదుగా "ఇందిరా ప్రియదర్శిని " అవార్డును అందుకున్నారు అని చెప్పారు.. వీటితో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు.. ప్రభుత్వ సంస్థలు అనేక అవార్డ్స్ ఇచ్చి కృష్ణమూర్తి ను సత్కరించాయి.. ఈ అభినందన సత్కార సభలో పవన పుత్ర వాకర్స్ క్లబ్ ప్రతినిధులు.. స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు..సెవిన్ స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ సేవా సంస్థలు.. నగరంలో ఉన్న నడక సంఘాలు అన్ని కలిసి నల్లబాటి కృష్ణమూర్తి .. విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించి.. సమాజానికి వారు అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గోలీ ఉమా మహేశ్వర రావు.. సభ్యులు గద్దిబోయిన కృష్ణారావు .. డి. కృష్ణా రావు .. పాలకొల్లు సూర్యారావు.. తిరుపతి..ఎం. మల్లిబాబు... వై. మోహన్ సుగంధం సంజీవ రావు.. ఈఈ గనిరాజు.. గోలీ సంతోష్.. పవన పుత్ర వాకర్స్ ప్రతినిధులు సోపేటి కొండలరావు.. బిఎస్ఎన్ఎల్ నాయుడు.. అందవరపు రవి.. స్టార్ వనితా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు...

## మంచి స్నేహం గొప్ప వరం

# మాచన రఘునందన్



స్నేహితులు ఎంత మంది ఉన్నా.. మంచి మాట చెప్పే వాడు ఒక్క మిత్రుడు చాలు..జీవితం లో గొప్ప మార్పు, మలుపు సాధ్యం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ, టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్ స్పష్టం చేశారు.
విద్యార్థులు, యువత ఎక్కువగా చెడు అలవాట్లకు గురయ్యేది జల్సాలకు అలవాటు ఐన ఫ్రెండ్స్‌తోనే అని సూచించారు.
ఎంతో మంది దోస్తులు ఉన్నారు అని గొప్పగా చెప్పుకోవడం కంటే..మన మంచి కోరి, చెడు అలవాట్లకు లోను కాకుండా..మంచి కోరి మందలిచగలిగే ఒక్క స్నేహితుడు.
ఓ గొప్ప సంపద తో సమానం అని రఘునందన్ హితవు చెప్పారు.

# భీంపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

**నవతరం టెక్కలి**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశానూసారంగా జూనైద్ అహ్మద్ మౌలానా, ఛైర్మెన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి వారి సూచనలు మేరకు కె. హరిబాబు, సెక్రెటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ . స్థానిక భీంపురం గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలికల వసతి గృహం సందర్శించారు. ఈ సందర్భంగా వారు బాలికలతో మాట్లాడుతూ వసతి గృహంలో వారికి అందుతున్న పౌష్టికాహారం మరియు ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు వసతి గృహ పరిసరాలను నేరుగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఉద్దేశించి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నీ సదుపాయాలను ఉపయోగించుకుని మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారులు పాల్గున్నారు.



# అమ్మ ఆశయం.. అక్షర విజయం!

## - సివిల్స్ విజేత రాముకు కలెక్టర్ ఘన సత్కారం
## - తల్లిని గౌరవించి, స్వయంగా వీడ్కోలు పలికిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్

**నవతరం -శ్రీకాకుళం**

ప్రభుత్వ బడిలో చదివి, పేదరికాన్ని జయించి సివిల్స్‌లో 463వ ర్యాంక్ సాధించి సత్తా చాటిన సౌరోతు రామును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఘనంగా సత్కరించారు. ఈ అపురూప ఘట్టానికి రాము తల్లి లక్ష్మి కూడా సాక్షిగా నిలిచారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కలిసి రాముకు శాలువా కప్పి, పుష్పగుచ్చం, విలువైన పుస్తకాలను బహుకరించి అభినందించారు.

### ఆదర్శం.. ఈ 'రాము'డి ప్రయాణం!

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాము ప్రతి విద్యార్థికి ఒక గొప్ప ఆదర్శం. తల్లి కూలీ పనులు చేస్తూ కొడుకును తీర్చిదిద్దడం, తండ్రిని కోల్పోయినా కుంగిపోకుండా ఎన్ఐటీ వరంగల్‌లో చదివి, నేడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడం సామాన్యమైన విషయం కాదని కొనియాడారు. రాము సాధించిన ర్యాంకుకు ఐపీఎస్ వస్తుందని భావిస్తున్నానని, ఐఏఎస్ కూడా వచ్చే అవకాశం ఉందని, ఏ విభాగంలో సేవలందించినా జిల్లాకు గర్వకారణమని ఆకాంక్షించారు.

### కలెక్టర్ పెద్దమనసు..

సత్కార కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. రాము తల్లిని గౌరవిస్తూ, ఆ తల్లికొడుకులను స్వయంగా కలెక్టర్ కార్యాలయం కింద వరకు తోడ్కొని వెళ్లి, మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారు. ఉన్నతాధికారి చూపిన ఈ ఆత్మీయతకి వారిరువురు కృతజ్ఞతలు తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**